
# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

ఫిబ్రవరి ,2025







# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

ఫిబ్రవరి , 2025

సంపుటి-4

సంచిక-2


## విషయ సూచిక


| సంఖ్య | శీర్షిక | రచయిత |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 02 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 03 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకరి |
| 04 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 05 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 06 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 07 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 09 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


శ్రీ మహాగణాధిపతయే నమః     శ్రీ గురుభ్యోనమః     శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**


© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.





యజ్ఞముల ద్వారా, అగ్నికార్యముల ద్వారా పరమాత్మతో మనలను అనుసంధానం చేస్తాడు పంచభూతదివ్యస్వరూపుడు అగ్నిభగవానుడు.ఆ అగ్నిభగవానుని ద్వారా వశిష్ఠునికి చెప్పబడి వేదవ్యాసునిచే లోకానికి అందించబడినది ఈ అగ్నిపురాణం. సంక్షిప్తంగా నవాహ (9 రోజుల) పారాయణమునకు వీలుగా అభినవశుక, ప్రవచననిధి పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు, వారి దివ్యాశీస్సులతో తమ శిష్యులచే సంకలం చేయించిన ఈ గ్రంథాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణ చేసినవారికి సమస్త వాస్తుదోషాలు, శత్రుపీడలు తొలగి, భయంకర కష్టాల్లోంచి బయటపడతారు. పుష్కరంలో స్నానం చేసి నూరు కపిలగోవులను దానం చేసిన మహాఫలితం పొందుతారు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org


శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక

ఏలూరు


## సంపాదకీయం

### మహిమాన్వితం-మాఘమాసం



అఘములను (పాపములను) తొలగించే మాసము ఈ మాఘ మాసము. ఇది త్రిమూర్తులకు అత్యంత ప్రియమైనది. అమ్మవారికి ప్రియమైన శ్యామలానవరాత్రులు కూడా ఈ మాసంలోనే వస్తాయి. అనంత విశ్వానికి ఆధారశక్తియైన సూర్యనారాయణుని అనుగ్రహం పొందే "రథసప్తమి" కూడా ఈ మాసంలోనిదే. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" సూర్యభగవానుని ఆరాధన ద్వారా ఆరోగ్యాన్ని పొందటానికి ఈ మాసం ఉపయుక్తం. ఈ క్రోధి నామ సంవత్సర మాఘమాసం మన ప్రణవపీఠ భక్తులకు అత్యంత ప్రీతికరమైనది. సనాతన ధర్మ సముద్ధరణలో భాగంగా ప్రణవపీఠ ఆలయాల ప్రతిష్ఠ జరిగి 12 సంవత్సరములు పూర్తి అయిన శుభసందర్భములో ప్రణవపీఠ స్థిత ఆలయాలలో విరాజిల్లుతున్న అమ్మలకు, ఆలయశిఖరాలకు పవిత్రనదీనదజలాలతో విశేష అభిషేకాలు జరగబోతున్నాయి. విశేష హోమాలు, అర్చనలు, వ్రతాదులు జరుపుకొనబోతున్నాము. ఈ నెల 10,11,12 తేదీలలో ఈ "కుంభాభిషేకములు" నిర్వహించబడుతున్నాయి.మహిమాన్విత మాఘమాసంలో, మహిమగల ప్రణవపీఠస్థిత ఆలయాలు కుంభాభిషేక శోభతో విరాజిల్లబోతున్నాయి. భక్తులు దర్శించి తరించుదురుగాక అని అనేక మంగళాశాసనములు చేస్తున్నాను.

వద్దిపర్తి పద్మాకర్

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు


# శ్రీ గణేశ పురాణం



శ్లో॥ గురువద్గురుపుత్రంచ మా భవాన్ హంతుమర్హతి ॥

(బ్ర.వై.పు.ఖం.3.అ.43.శ్లో.5)

గురువును చంపకూడదని శాస్త్రం. అలాగే గురుపుత్రకులను కూడా, అని కుమారుడు పలికాడు. క్రోధంతో ఉన్న పరశురాముడు ఎవ్వరి మాటలూ వినలేదు. గండ్ర గొడ్డలి ఎత్తి గణపతిపైకి వెళ్ళాడు. గణపతి ధర్మస్వరూపుడు. క్రోధం ఏమాత్రం దరిచేరదీయని మహాత్ముడు. అందువల్ల పరశురాముని శాంతపరచడానికి ప్రయత్నిస్తూ మరలా ఇలా అన్నాడు – జామదగ్నీ! కొంతసేపు తాళి, శివానుగ్రహం కలిగాక లోపలకు వెళ్ళడానికి, అనుమతి తీసుకొని మరీ వెడుదువు గాని. ఈశ్వరాజ్ఞ లేనిదే అంతఃపురం లోనికి ఎవ్వరూ వెళ్ళరాదు. శివాజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదు. నీవు సోదరతుల్యుడివి. పైగా కైలాసానికి వేం చేసిన అతిథివి. శివునకు అత్యంత ప్రీతిపాత్రుడైన శిష్యుడివి. మనమిద్దరం ఒకే గురువు వద్ద విద్యలను అభ్యసించిన వారం కనుక నీపై నాకు అధిక ప్రీతి కూడా ఉన్నది. నీవు బలప్రయోగం చేస్తే జంకడానికి నేను కార్తవీర్యుడిని కాను. నీ చేతిలో మరణించిన సామాన్యులైన రాజుల క్రింద నన్ను జమకట్టకు. బ్రాహ్మణోత్తమా! సహనం చాలా అవసరం. ఇలా గణేశుడు అతనికి హితబోధ చేసాడు. గణపతి ఇంతగా చెప్పినా పరశురాముడు మొండితనం విడిచిపెట్టలేదు. నవ్వి గండ్రగొడ్డలిని ఎత్తాడు. గణపతి తన తొండాన్ని బాగా పొడవు చేసి పరశురాముడిని తొండంతో చుట్టి గిరగిరా త్రిప్పాడు. గరుడుడు చిన్న పామును కాళ్ళతో పట్టుకొని త్రిప్పినట్లుగా పరశురాముడిని త్రిప్పడంతో అతని అవయవాలన్నీ కంపించిపోయాయి. సప్త మహాద్వీపాలు, కులపర్వతాలు, మరీ ముఖ్యంగా మేరువు, సమస్త సముద్రాల చుట్టూ గిరగిరా తిరిగిన పరశురామునికి ఆ దెబ్బతో కళ్ళు బైర్లు క్రమ్మాయి. రామునకు తొండం నుండి విముక్తుడవ్వడం కుదరలేదు.

శ్లో॥ భూర్లోకం భువర్లోకం స్వర్లోకం చ సురేశ్వరః
జనోలోకం తపోలోకం ధ్రువలోకం చ తత్పరమ్
గౌరీలోకం శంభులోకం దర్శయామాస నారద!
దర్శయిత్వాతు విధ్యండం స పపా సప్త సాగరాన్
పునరుద్ధిరణం చక్రే సనక్రమకరోదకమ్
తత్రం తం పాతయామాస గంభీరే సాగరోదకే ॥

(బ్ర.వై.పు.ఖం.3.అ.43.శ్లో.19 నుండి 21)

గణపతి సకల దేవగణాధిపతి. ఆయన పరశురామునికి భూలోకం, భువర్లోకం, స్వర్లోకం, జనోలోకం, తపోలోకం, ధ్రువలోకం, ఆపై గౌరీలోకం, శంభులోకం, గిరగిరా తొండంతో పట్టుకొని త్రిప్పుతూ చూపించాడు. అలా తిరుగుతున్న పరశురాముడు సప్తసముద్రాలలో కూడా గిరగిరా త్రిప్పబడుతూ, ఆ జలాలను త్రాగాడు. త్రాగిన సముద్రజలాలను కక్కి వేసాడు. కక్కుతున్నప్పుడు గణపతి ఆయనను సముద్ర జలాలలో పారవేసి ఉక్కిరి బిక్కిరి చేసి, మళ్ళీ తొండంతో చుట్టాడు. యోగమాయా ప్రభావాన్ని ప్రదర్శిస్తూ వైకుంఠ దర్శనం చేయించాడు. వైకుంఠంలో నాలుగు చేతులతో ఉన్న నారాయణుని,

.. ఇంకా ఉంది

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## దానాలు – ఫలితాలు



జలదానం చేసిన తరవాత తక్కిన దానాలు చేస్తే, ఆ దానాలు అనంత ఫలితాన్ని ఇస్తాయి. అందరిపై దయచూపాలి. అందునా, తపోనిష్ఠులు, జ్ఞానులు, వేదశాస్త్ర పండితులు, పౌరాణికులు విష్ణుస్వరూపులు కనుక వారిపై మరింత భక్తిని ప్రదర్శించి, జలదానాదులు చేయాలి. జ్ఞానులు విష్ణువునకు నిత్యప్రీతులు. వారిని విష్ణువు తనతో సమానంగా ఆదరిస్తాడు. అష్టాదశపురాణవేత్త సాక్షాత్తుగా విష్ణువే. అటువంటివాడు ఎల్లప్పడూ పూజ్యుడే. (తస్మాత్ జ్ఞానీ సదాపూజ్యః పూజ్యాత్పూజ్యతరః స్మృతః — స్కాం.పు.వే.మా.అ.16.శ్లో.36) కనుక జ్ఞాని అయిన పురాణజ్ఞుడు ఎల్లప్పడూ పూజ్యుడు. పూజింపదగిన వారిలో కెల్లా పూజ్యుడు. ఇక్ష్వాకు వంశ సంభవా! నీ దోషం నీకు తెలిసింది కదా! దీనికి ప్రాయశ్చిత్తం నేను నీ కోసం చేస్తాను.

శ్లోII వేంకటాద్రే కృతం పుణ్యం తుభ్యం దాస్యామి శాంతయే
భూతం భవ్యం భవత్తేన కర్మజాతం విజేష్యసి II
(స్కాం.పు.వేం.మా.అ.16.శ్లో.38)

నేను వేంకటాద్రికి వెళ్ళినప్పుడు పుణ్యకర్మలు చేసాను. ఆ పుణ్యఫలాన్ని నీ శాప పాప జన్మలు తొలగడానికి నీకు ఇస్తాను. ఆ పుణ్యఫలం వల్ల ఇదివరకు చేసినవి, చేయబోయేవి అయిన పాపాలన్నీ నశిస్తాయి. నీవు పవిత్రుడవు. శాపవిముక్తడవు అవుతావు. ఈ విధంగా పలికి శ్రుతదేవుడు చేతిలోనికి నీళ్ళు తీసుకొని, వేంకటగిరిపై చేసిన తన పుణ్య ఫలం ధారపోస్తున్నానని సంకల్పం చెప్పి, ఆ నీళ్ళు బల్లిపై పోసాడు. ఆ నీళ్ళు పడడం తోటే బల్లి రూపంలో ఉన్న హేమాంగుడు సుందర పురుషుడుగా మారాడు. అతని పాపాలన్నీ నశించిపోయాయి. దివ్యమైన పూలమాలలు, వస్త్రాలు ధరించి, మిథిలాధిపతికి ధన్యవాదాలు చెప్పాడు. శ్రుతకీర్తి, గృహంలోని సాధువులందరూ చూస్తుండగా, శ్రుతదేవునికి నమస్కరించి, ప్రదక్షిణలు చేసి, ఆయన అనుమతి తీసుకొని, దివ్య విమానం ఎక్కి స్వర్గానికి వెళ్ళాడు. వేంకటాచలంలో ఒక్క దినమున చేసిన స్నాన దాన ఫలితం శ్రుతదేవుడు ధారపోయడంతో హేమాంగునికి సద్గతులు కలిగాయంటే, నిరంతరం అక్కడకు వెళ్ళి సత్కార్యాలు చేసే వారికి కలిగే సత్ఫలితాలు ఎలా ఉంటాయో ఆలోచించండి. వేంకటాచలం భూలోకవైకుంఠం. నమ్మిన వారికి తత్ క్షణం శుభాలు కలిగించే కొండంత అండనిచ్చే కొండ. ఆ కొండపై చేసే పాపాలు కూడా అంతే. అంతులేని నరకాలనిస్తాయి. ఇది గ్రహించి ఆ కొండపై పిచ్చిపనులు చేయకుండా జాగ్రత్త పడాలి. వేంకటాచలం సర్వపాపాలను ఆ క్షణమే తొలగించే క్షేత్రం. తెలిసి చేసినా తెలియక చేసినా పుణ్యమైనా, పాపమైనా అనుభవించి తీరవలసిందే. స్వామివారికి చేసే సేవలు, అర్చనలు ఎన్ని యుగాలైనా జీవులను అనుగ్రహించి

....ఇంకా ఉంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# పురాణం లో మహిళలు

## ఉత్తర



అజ్ఞాతవాస సమయం ముగియబోతున్నప్పుడు, పాండవులు వారి వేషధారణలో వస్తారు, అప్పుడు విరాటరాజు పాండవుల పట్ల గౌరవం చూపిస్తాడు. అజ్ఞానంలో జరిగిన తప్పుల పరిహారం కోసం, మరియు పాండవులతో శాశ్వత స్నేహం స్థాపించడానికి, తన కుమార్తె ఉత్తరను అర్జునుడికి ఇచ్చి వివాహం చేయాలని ప్రతిపాదించారు. ఈ విషయం పై అర్జునుడు ఇలా అన్నాడు - "రాజా! నేను బృహన్నల రూపంలో ఏడాది పాటు ఉత్తరకు నృత్యం మరియు సంగీతం నేర్పాను. రాజకుమారిని భార్యగా స్వీకరిస్తే, ప్రజలు నా మీద మరియు మీ కుమార్తె యొక్క వ్యక్తిత్వంపై అనుమాన పడతారు. అలాగే గురు-శిష్య సంప్రదాయాన్ని అవమానించడమవుతుంది. రాజకుమారి నాకు కుమార్తెలాంటిది. కాబట్టి, ఉత్తరను నా కుమారుడు అభిమన్యుడి భార్యగా స్వీకరిస్తాను. అందరూ అర్జునుడి ధర్మనిష్ఠను ప్రశంసించారు, మరియు ఉత్తర-అభిమన్యుల వివాహం ఘనంగా జరిగింది.మహాభారత యుద్ధంలో అర్జునుడు సంసప్తకులతో యుద్ధం చేయడానికి దూరంగా వెళ్ళినప్పుడు, ద్రోణాచార్యుడు ఈ అవకాశాన్ని ఉపయోగించి చక్రవ్యూహాన్ని నిర్మించాడు. భగవంతుడు శంకరుని వరప్రసాదంతో జయద్రథుడు పాండవులందరిని చక్రవ్యూహంలో ప్రవేశించకుండా అడ్డగించాడు. కానీ మహావీరుడు అభిమన్యుడు మాత్రం వ్యూహంలోకి ప్రవేశించగలిగాడు. ఆయన తన అపారమైన వీరత్వాన్ని ప్రదర్శించి, కౌరవ పక్షంలోని ప్రధాన రథులపై అనేక సార్లు విజయం సాధించాడు. చివరికి, కౌరవ రథులు అందరూ కలిసి అన్యాయంగా అభిమన్యుని హతమార్చారు.ఆ సమయంలో ఉత్తర గర్భవతిగా ఉంది. భగవంతుడు శ్రీకృష్ణుడు ఆమెకు ధైర్యం ఇచ్చి, ఆమెను తన భర్తతో సతిగా మారడం నుండి నివారించాడు. ఆ తర్వాత, అశ్వత్థామ ద్రౌపదీ ఐదుగురు కుమారులను హతమార్చి, పాండవుల శిబిరానికి నిప్పుపెట్టాడు. అర్జునుడు అతడిని పట్టుకుని ద్రౌపదీ ఎదుట హాజరుపరిచాడు. తన కుమారులు హతమార్చబడ్డా, ద్రౌపది తన కరుణతో అతడిని విడుదల చేయించింది. అయితే, ఆ క్రూరుడు పాండవుల వంశాన్ని నాశనం చేయాలనే ఉద్దేశంతో, బ్రహ్మాస్త్రాన్ని ఉత్తర గర్భంపై ప్రయోగించాడు. ఉత్తర పాపం ఆర్తిగా పిలిచినప్పుడు, భగవంతుడు శ్రీకృష్ణుడు సూక్ష్మరూపంలో గర్భంలో ప్రవేశించి పాండవుల వంశస్థుడిని బ్రహ్మాస్త్రం నుండి రక్షించాడు. కానీ పుట్టినప్పుడు శిశువు మృతుడిగా పుట్టాడు. భక్తవత్సలుడైన శ్రీకృష్ణుడు వెంటనే జలాన్ని ప్రోక్షించి శిశువుకు ప్రాణం ప్రసాదించారు. వెంటనే శిశువు శ్వాస ప్రారంభమైంది. చుట్టూ ఆనందకోలాహలం మార్మోగింది. ఆ పాండవుల వంశస్థుడే "పరీక్షిత్" గా ప్రసిద్ధుడయ్యాడు. భగవద్భక్తికి మరియు విశ్వాసానికి మారుపేరైన సతీ ఉత్తర ధన్యురాలు.

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 340 . విలాసినీ – [ఓం ఐం హ్రీం శ్రీం విలాసిన్యై నమః]



అమ్మవారు అలంకారస్వరూపిణి – సృష్ట్యాదులను చేయడం ఆమెకొక క్రీడ. కనుక ఆటలాడు కొనునది అని ఒక అర్థం. "విలాసి" అనబడే నకారాంత పుంలింగ శబ్దానికి అగ్ని, చంద్రుడు అని కూడా అర్థాలున్నాయి. విలాసినీ శబ్దానికి అగ్నిస్వరూపిణి అని చంద్రస్వరూపిణి అని కూడా అర్థాలు చెప్పవచ్చును. బ్రహ్మరంధ్రంలో ఉండే అమృతస్వరూపిణి అని కూడా అర్థం. చంద్రుడు అమృతకిరణుడు. చంద్రస్వరూపిణి అయిన అమ్మ బ్రహ్మరంధ్రం నుండి అమృతాన్ని ప్రవహింపజేస్తుంది. కనుక విలాసిని.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం

శరీరం పాలిపోయి, చురుకుదనం లేకుండా బాధపడే వారు తరుచుగా తలనొప్పితో బాధపడేవారు, ఈ మంత్రాన్ని యథాశక్తిగా జపం చేసి, పచ్చకర్పూరం, తులసీదళాలను ఒక పాత్రలో నీటితో కలిపి, జపానంతరం తీర్థంగా త్రాగాలి. శుభఫలితం లభిస్తుంది.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# ఋషి చరిత్ర

## జమదగ్ని మహర్షి



మన సంస్కృతికి మహర్షులు మూలాధారం. సత్యం ఎక్కడైతే ఉంటుందో అక్కడ ధర్మం ఉంటుంది. సత్యవాక్పరిపాలకులు పలికే పలుకులు నిజం అవుతాయి. మహర్షులు భూత, భవిష్యత్, వర్తమానాలను తెలిసినవారు. కాని నిర్వికారులు. మహర్షుల జీవితం వల్ల ఏ పరిస్థితుల్లో వ్యక్తులు ఎవరెవరితో ఎలా ప్రవర్తించాలో, జీవితంలో ఎటువంటి విలువలను పాటించాలో, నైతికవిలువల ప్రాధాన్యత ఏంటో తెలుస్తుంది. ఈ క్రమంలో జమదగ్నిమహర్షి జీవిత గాథను సంక్షిప్తంగా తెలుసుకుందాము. భృగువంశానికి చెందిన ఋచీకమహర్షి మరియు కుశికవంశానికి చెందిన గాధిరాజు కూమార్తె అయిన సత్యవతికి జన్మించిన కుమారుడు జమదగ్ని. తన తపోబలంతో కామధేనువును సంపాదించుకున్నాడు. కామధేనువు కారణముగ ఏ కొఱత లేకుండా జమదగ్ని రేణుకాదేవితో సమస్తభోగములనుభవించుచు మహాతపస్సంపన్నుడని పేరు పొందాడు. జమదగ్ని కామధేనువు సహాయంతో తన వద్దకు వచ్చిన వారందరికీ సంతృప్తిగా భోజనాలు ఏర్పాటు చేసేవాడు. ఒకసారి కార్తవీర్యార్జునుడు జమదగ్ని ఆశ్రమానికి విచ్చేసినప్పుడు, తన కామధేనువు సహాయంతో మొత్తం రాజపరివారానికి విందు ఏర్పాటు చేసాడు. కామధేనువు యొక్క శక్తి తెలుసుకున్న కార్తవీర్యార్జునుడు ఆ ధేనువును తనకు ఇవ్వాల్సిందిగా జమదగ్నిని కోరాడు. కానీ జమదగ్ని అందుకు అంగీకరించలేదు. కోపగించిన కార్తవీర్యార్జునుడు ధేనువును బలవంతంగా తనతో తీసుకుని వెళ్ళిపోయాడు. ఇంటికి తిరిగి వచ్చిన పరశురాముడు విషయం తెలుసుకున్నాడు. కోపంతో కార్తవీర్యార్జునునితో యుద్ధం చేసి ఆయనను సంహరించాడు. ఈ విషయం తెలుసుకున్న జమదగ్ని తన కుమారుణ్ణి మందలించాడు. కార్తవీర్యార్జునుని సంహరణకు పరిహారంగా తీర్థయాత్రలు చేసి రమ్మని పంపాడు. తమ తండ్రి మరణానికి ప్రతీకారంగా కార్తవీర్యార్జునుని కుమారులు జమదగ్నిని సంహరించారు. ఆ సమయంలో జమదగ్ని యజ్ఞం నిర్వహిస్తూండటంతో ప్రతిఘటించలేదు. ఇదంతా గమనిస్తున్న ఆయన భార్య రేణుక తన కుమారుని వచ్చి కాపాడమని ఇరవై ఒక్కమార్లు పిలిచింది. కాని తీర్థయాత్రలో ఉన్నందున పరశురాముడు స్పందించలేదు. తిరిగి వచ్చిన తరువాత కోపంతో పరశురాముడు పరశువును తీసుకుని లోకంలోని క్షత్రియులపై ఇరవైఒక్కమారు దండెత్తి సంహరించి, తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకున్నాడు. తపోబలసంపన్నుడైన జమదగ్ని క్షత్రియుల చేతిలో హతం కావటానికి పురాణాల్లో ఒక కథనముంది.

...ఇంకా ఉంది

# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం



**శివ** నామస్మరణ చేసుకుంటూ కాశీ వరకు చేరుకున్నాము,ఆయన అంతర్గృహమునకు వెళ్లి పోయెను.పిశాచం అవ్వడం వల్ల నాకు ప్రవేశం లేదు, ఆ సన్యాసితో పాటు శివస్మరణ చేసుకుంటూ కాశీ వరకు రావడం వలన నాకు పంచక్రోశము వరకు అనుమతి లభించింది. ఆ తర్వాతే మీరు నా భాగ్యం కొద్దీ నన్ను చూసి నాపై దయతో నన్ను గురించిన విషయాలను అడిగారు.ఇది ఈ రోజున జరిగింది. ఓ మహాత్మా నన్ను అనుగ్రహించండి". పిశాచి కథను విన్న వాల్మీకి,నీకు శివానుగ్రహము కొఱకు మార్గము చూపిస్తాను అని చెప్పెను.పాప నాశనము కొఱకు ఈ విమలోదక నామతీర్థంలో స్నానం చేయి.ఈ తీర్థ స్నాన అనంతరం కపర్దీశ్వర దర్శనం చేసుకో,తరువాత క్షణకాలంలో నీ పిశాచత్వము నశించిపోతుంది అని పలికెను. వాల్మీకి మాటలు విన్న రాక్షసుడు ఈ విధముగా ప్రశ్నించెను తీర్థరక్షకులు, జలరక్షకులు, దేవతలు నన్ను ఈ తీర్థము లో ప్రవేశించకుండా అడ్డుకుంటారు అందువల్ల నేను ప్రవేశించలేను. ఈ జల స్పర్శ కూడా నాకు దుర్లభమే. రాక్షసుడను, పిశాచిని అయినందువలన నాకు ఆ యోగము లేదు అని పలికెను.రాక్షసుడి మాటలు విన్న మహర్షి ఈ విధముగా చెప్పెను "విభూతిని నుదుటిపై ధరించు, విభూతి యొక్క మహిమ చాలా గొప్పది.విభూతిని ధరించినవాడిని యముడైనా సరే ఏమీ చేయలేడు,అతని కింకరులు విభూతి ధరించిన వారి వైపు కూడా చూడలేరు అంతటి మహిమ ఈ భస్మమునకు ఉన్నది. నీకు భయము లేకుండా నేను చెప్పిన విధముగా విభూతిని ధరించి స్నానం చేయి నిన్ను ఏ దేవతలూ తీర్థ ప్రవేశం చేయకుండా ఆపలేరు.ఎవరైతే శివ మంత్రముతో అభిమంత్రించబడిన విభూతిని ధరిస్తారో వారిని ఎటువంటి భయాలు,హింసా,కష్టములు తాకవు.శరీరం పై శివమంత్రమును చదువుతూ ధరించినటువంటి భస్మం అన్ని విధములైన భయములనుండి రక్షణ కలిగిస్తుంది".ఈ విధముగా పలికి చేతిలో భస్మము తీసుకొని రాక్షసుని చేతిలో కొంచం పెట్టెను. రాక్షసుడు ఆ భస్మమును ధరించి విమలోదక తీర్థములో స్నానం చేసేను.జలరక్ష దేవతలు భస్మధారణ చేసిన ఈ పిశాచిని చూసినప్పటికీ,పిశాచి అయినా భస్మం ధరించినందువలన జలరక్షణ దేవతలు కూడా ఏమీ చేయలేకపోయారు.పిశాచి స్నానమాచరించి, తీర్థ జలమున స్వీకరించాడు,కపర్దీశ్వరుడుని మనసారా ప్రార్థించాడు.వెంటనే అతని శరీరం దివ్యకాంతిని పొందింది,దివ్య వస్త్రములు వచ్చి చేరాయి, దివ్యమాలలు అతని శరీరంపైన వచ్చాయి,అతని శరీరం నుండి సువాసనలు వచ్చాయి. అక్కడికి ఒక దివ్య విమానం కూడా వచ్చింది.

...ఇంకావుంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# స్తోత్రమాలిక

## కాలభైరవాష్టకం

1. దేవరాజసేవ్యమానపావనాంఘ్రిపంకజం
 వ్యాళయజ్ఞసూత్రమిందుశేఖరం కృపాకరం I

నారదాదియోగిబృందవందితమ్ దిగంబరం
 కాశికాపురాధినాథ కాలభైరవం భజే II

౨. భానుకోటిభాస్వరం భవాబ్ధితారకం పరం
 నీలకంఠమీప్సితార్థదాయకం త్రిలోచనమ్ I

కాలకాలమంబుజాక్షమక్ష శూలమక్షరం
 కాశికాపురాధినాథ కాలభైరవం భజే II

3. శూలటంకపాశదండపాణిమాదికారణం
 శ్యామకాయమాదిదేవమక్షరం నిరామయమ్ I

భీమవిక్రమం ప్రభుం విచిత్రతాండవప్రియం
 కాశికాపురాధినాథ కాలభైరవం భజే II

4. భుక్తిముక్తిదాయకం ప్రశస్తచారువిగ్రహం
 భక్తవత్సలం స్థితమ్ సమస్తలోక నిగ్రహమ్ I

నిక్వణన్మనోజ్ఞహేమకింకిణీలసత్కటిం
 కాశికాపురాధినాథ కాలభైరవం భజే II

5. ధర్మసేతుపాలకం త్వధర్మమార్గనాశకం
 కర్మపాశమోచకం సుశర్మదాయకం విభుమ్ I

స్వర్ణవర్ణకేశపాశశోభితాంగమండలం
 కాశికాపురాధినాథ కాలభైరవం భజే II

6. రత్నపాదుకాప్రభాభిరామపాదయుగ్మకం
 నిత్యమద్వితీయమిష్టదైవతం నిరంతరమ్ I

మృత్యుదర్పనాశనం కరాలదంష్ట్రభీషణం
 కాశికాపురాధినాథ కాలభైరవం భజే II

7. అట్టహాసభిన్నపద్మజాండకోశసంతతిమ్
 దృష్టిపాతనష్టపాపజాలముగ్రనాశనమ్ I

అష్టసిద్ధిదాయకం కపాలమాలికాధరం
 కాశికాపురాధినాథ కాలభైరవం భజే II

8. భూతసంఘనాయకం విశాలకీర్తిదాయకం
 కాశివాసిలోకపుణ్యపాపశోధకం విభుమ్ I

నీతిమార్గకోవిదం పురాతనం జగత్ప్రభుమ్
 కాశికాపురాధినాథ కాలభైరవం భజే II

౯. కాలభైరవాష్టకం పఠంతి యే మనోహరం
 జ్ఞానముక్తిసాధనం విచిత్రపుణ్యవర్ధనమ్ I

శోకమోహదైన్యలోభకోపతాపనాశనం
 తే ప్రయాంతి కాలభైరవాంఘ్రిసన్నిధిం ధ్రువమ్ II

### ఫలశ్రుతి:

కాలభైరవాష్టకమును భక్తి శ్రద్ధలతో 40 రోజులు (మండలం) పారాయణం చేసే వారికి కాశీ క్షేత్రములో నివసించే మహాయోగం లేదా కాశీ క్షేత్రములో మరణిస్తే కలిగే పుణ్యఫలం లభిస్తుంది.

# గురుదేవుల జీవన కవనము

## షడ్వింశతిః అధ్యాయః



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారు తెలుగు భాష కొఱకు చేసిన సేవ అద్భుతమైనది.గురుదేవులు శిష్యులందరికీ తరచుగా తెలుగు పై అవగాహన కలిగిస్తూనే ఉంటారు.గురుదేవుల ప్రవచనముల గురించి, భాగవత సప్తాహముల గురించి ,అవధానముల గురించి అనేక విషయాలు భక్తులందరికీ తెలుసు.అనర్గళ ప్రవచన ప్రవాహాలతో పాటు గురుదేవులు భక్తులు అందరితో కలసి వందలాది క్షేత్రములలో తీర్థ యాత్రలు చేసారు. ప్రతి క్షేత్రంలోనూ భాగవత సప్తాహమును నిర్వహించారు. శ్రీలంక,నేపాల్, సింగపూర్ మలేషియా వంటి ప్రాంతములలో కూడా సనాతన ధర్మ మూలముల గురించి తెలియచేసి అక్కడ ఉన్న పుణ్య క్షేత్రములలో భక్తులతో కలసి భగవంతుడ్ని స్మరించారు. గంగా ప్రవాహమునైనా ఆపగలం కానీ గురుదేవుల ఆధ్యాత్మిక యాత్రలను ఆపటం మాత్రం సాధ్యం కాదు.

పూజ్య గురుదేవులు శైవ క్షేత్రమైనా,వైష్ణవ క్షేత్రమైనా,శక్తి క్షేత్రమైనా భక్తులతో కలిసి వెళ్లి భక్తులకు ఆ క్షేత్రముల యొక్క మహిమలను వివరించి వారిని తరింపజేస్తున్నారు. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో కూడా గురుదేవులు భక్తులకు అందుబాటులో ఉంటూ వారి ధర్మసందేహాలన్నింటినీ యాత్రలలో నివృత్తిచేస్తూ భగవద్ మార్గాన్ని భక్తులకు చూపించారు. పురాణములలో వ్యాస భగవానుడు వందల మంది శిష్యులతో కలిసి యాత్రలు చేసేవారు అని వినటమే కానీ చూడలేదు, కానీ పూజ్య గురుదేవులను చూస్తే అది నిజం అనిపిస్తుంది.గురుదేవులు కూడా ఒక్కసారిగా వారితో పాటు వందల మంది శిష్యులతో యాత్రలకు వెళ్తున్నారు.2024 సంవత్సరం ద్వారకలో గురుదేవులు తలపెట్టిన భాగవత సప్తాహం తరువాత జరిపిన భాగవత ఊరేగింపు అందుకు నిదర్శనం. వందల మంది తెలుగు నేల నుండి గురుదేవులతో పాటు ద్వారకా యాత్ర చేసారు.వ్యాస స్వరూపులు కనుకనే వారికి మాత్రమే సాధ్యమైంది.భార్య, భర్తలు ఇద్దరూ కలిసి రెండు రోజుల పాటు ప్రశాంతంగా యాత్రను పూర్తి చేయలేని పరిస్థితులు నేడు ఉన్నాయి అటువంటిది పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారి ఆధ్వర్యవంలో వందలాది మంది భక్తులు అత్యంత భక్తితో,వినయముతో యాత్రలను పూర్తిచేస్తున్నారు.భక్తుల కొఱకు కఠినమైన చార్‌ధామ్ యాత్రను గురుదేవులు వెనువెంటనే రెండుసార్లు చేసారు.

.. ఇంకా ఉంది